క్లుప్తంగా

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల సత్వర పరిష్కారం



మీడియేషన్‌పై న్యాయమూర్తి షియాజ్ ఖాన్ ఆధ్వర్యంలో ర్యాలీ

నర్సీపట్నం: మధ్యవర్తిత్వం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చునని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ పేర్కొన్నారు. దేశ వ్యాప్త కార్యక్రమంలో భాగంగా న్యాయమూర్తి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం 90 రోజుల పాటు జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో మధ్యవర్తిత్వం అందుబాటులోకి వచ్చిందన్నారు. 2023లో మీడియేషన్‌పై చట్టం చేశారన్నారు. ప్రత్యేకంగా ఆరుగురు న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారన్నారు. కక్షిదారులు రాజీమార్గంలో కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు మీడియేషన్ దోహదపడుతుందన్నారు. ఈ ర్యాలీలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన



ఐఎఫ్‌పీ ద్వారా విద్యార్థులకు బోధిస్తున్న రాము

మాకవరపాలెం : మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పి) ద్వారా శాస్త్ర సాంకేతికతపై ఉపాధ్యాయుడు కె.రాము విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా 18 రోజులపాటు అంతరిక్షంలో ఉండి భూమిపైకి తిరిగి వచ్చిన శుభాన్షు శుక్లాకు సంబంధించిన వీడియోను విద్యార్థులకు చూపించారు. మరలా 2027లో భారతదేశం నుంచి గగన్‌యాన్ మిషన్‌లో శుభాన్షు శుక్లా అంతరిక్షంలోకి వెళ్లనున్నట్టు తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచి శాస్త్ర సాంకేతికతపై తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా బోధన చేస్తున్నట్టు రాము తెలియజేశారు. కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దేరు నుంచి పంట కాలువలకు సాగునీరు

మాడుగుల : మండలం అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశం నుండి ఆర్ఎంసీ రాచ కట్టు పంటకాలువలకు చెరొక 50 క్యూసెక్కులు చొప్పున సాగునీరు విడుదల చేస్తున్నట్టు జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. దీంతో వరి నారుమడులకు నీరు పెట్టడంతో పాటు ఖరీఫ్ పంటలకు ఢోకాలేదని, జలాశయం ఆయకట్టు 15 వేల ఎకరాలకు సాగు నీరు పుష్కలంగా సరిపోతుందని, రైతులు ఆందోళన చెందవద్దని జేఈ తెలిపారు.

కె.కోటపాడు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా రామారావు



రామారావును అభినందిస్తున్న నాయకులు

కె.కోటపాడు : కె.కోటపాడు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా కొరువాడ గ్రామానికి చెందిన చీపురపల్లి రామారావు నియమితులయ్యారు. బుధవారం కె.కోటపాడు పీఏసీఎస్ కార్యాలయంలో బాధ్యతలను రామారావు స్వీకరించారు. ఈయనతో పాటు పీఏసీఎస్‌కు మరో ఇద్దరు డైరెక్టర్లుగా గొట్లాం గ్రామానికి చెందిన రుద్ర ఈశ్వరరావు, రొంగలినాయుడుపాలెం గ్రామానికి చెందిన దొగ్గ వెంకటరావు నియమితులయ్యారు. ఆయన్ని రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్, మాజీ వైస్ ఎంపీపీ అవుగడ్డ సాంబాబు, సబ్బవరపు రామునాయుడు, సొసైటీ సీఈవో ఆర్.చిన ఈశ్వరరావు అభినందించారు.

గోవాడలో ఉచిత వైద్య శిబిరం

చోడవరం : మండలంలో గోవాడ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఆర్.ఆర్.సేవా సంఘం ఆధ్వర్యంలో అనిల్ నీరుకొండ ఆస్పత్రి (సంగినవలస) సౌజన్యంలో జరిగిన ఈ శిబిరంలో 120 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏడువాక ఆనంద్, బేరా సత్యారావు, లక్ష్మీకుమార్ పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

మాడుగుల : ఈ నెల 18 వ తేదీన మాడుగుల బసవా రామ పరమేష్ గోడౌన్ వద్ద వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి ప్లీనరీ సమావేశం జరగనుందని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటలకు జరగనుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరు కానున్నారన్నారు. మండలంలో 29 పంచాయతీల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు విధిగా హాజరుకావాలని కోరారు.

పాఠశాల భవనం ప్రారంభించారు...

ప్రవేశాలు మరిచారు..

- టైప్-4 కేజీబీవీలో అడ్మిషన్లకు విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి



ప్రవేశాలకు నోచుకోని టైపు-4 కేజీబీవీ భవనం

రోలుగుంట : మండలం జె.నాయుడుపాలెం గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న టైపు-4 కేజీబీవీ పాఠశాల భవనాన్ని గతేడాది అక్టోబర్ 24 న చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్, స్థానిక నాయకులు, ఆ శాఖ అధికారులతో కలసి ప్రారంభోత్సవం చేశారు. దీంతో తమ పిల్లలను పాఠశాలలో చేర్పించే అవకాశం వచ్చిందని స్థానికులు ఆశపడ్డారు. ఈ ఏడాది సాధారణ బదిలీల్లో భాగంగా పి.నాగేశ్వర్రావు బదిలీపై వచ్చి ఈ పాఠశాలలో బాధ్యతలు స్వీకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో టైపు-4 కేజీబీవీ పాఠశాలలో ప్రవేశాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. దీనిలో 9,10 తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దీంతో సమారు 50 మంది వరకూ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం వేసవి సెలవులనంతరం జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నా ప్రవేశాలు మాత్రం జరగలేదు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక సర్పంచ్ బగుడు వెంకట రమణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నక్కా వెంకట రమణ పాఠశాల సందర్శించి సమస్య తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటి వరకూ ప్రవేశాలు జరగలేదని, తమ పిల్లలు అడ్మిషన్లు లేకుండా గాలిలో ఉన్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వారి దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు. కాగా ఈ సమస్యపై ఎంఈవో జానుప్రసాద్‌ని సాక్షి సంప్రదించగా సర్వశిక్షా అభియాన్ అధికారులకు సమస్య విన్నవిస్తామని తెలిపారు.

గాడి తప్పిన సచివాలయాలు

- సమయపాలన పాటించని ఉద్యోగులు
- కొరవడిన పర్యవేక్షణ



శారదానగర్‌లో తెరవని 17వ సచివాలయం

నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీలో వార్డు సచివాలయాల్లో పాలన గాడి తప్పింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వార్డు సచివాలయాలను అందుబాటులోకి తెచ్చింది. గత ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన సేవలు అందించేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ పాలన పూర్తిగా గాడి తప్పింది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సచివాలయ పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. వివిధ పనులపై వచ్చిన ప్రజలు వెనుతిరుగుతున్నారు. వీఆర్వోలు పూర్తిగా సచివాలయాలకు రావడమే మానేసారు. తహసీల్దార్ కార్యాలయానికి పరిమితమై అక్కడ నుండే సేవలు అందిస్తున్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ శారదనగర్‌లో ఉన్న 17వ సచివాలయం సిబ్బంది బుధవారం సమయం 11 గంటలు కావస్తున్నా కార్యాలయం తెరవేదు. కనీసం సచివాలయం అని తెసేందుకు బోర్డు కూడా పెట్టలేదు. కులధ్రువీకరణ, రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునే వారు నిరాశతో వెనుతిరిగారు. ఈతరహాలోనే మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 17 సచివాలయాల్లో సిబ్బంది వ్యవహరిస్తున్నారు. కార్యాలయాల్లో ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. అసలు సమయపాలన పాటించనందున వివిధ పనులపై సచివాలయాలకు వచ్చిన వారు పదే పదే ప్రదక్షణలు చేస్తున్నారు. వార్డు వీఆర్వోలు అయితే అసలు సచివాలయాలను మరిచిపోయారు. తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసుకుని వార్డులకు వెళ్లకుండానే పాలన సాగిస్తున్నారు. రెవెన్యూ పరమైన ఏపని అయిన సచివాలయంకు కాకుండా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. సచివాలయాలపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సురేంద్రను సంప్రదించగా సమయ పాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోండి



అవగాహన కల్పిస్తున్న రావికమతం విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్

రావికమతం : మండలంలో మేజర్ పంచాయితీ కొత్తకోటలో గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం ప్రధానమంత్రి సూర్యఘర్ సోలార్ రూఫ్ టాప్‌పై గ్రామ ప్రజలకు రావికమతం మండల విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ,దీనిపై ప్రభుత్వం సబ్సిడీతో పాటు బ్యాంక్ రుణ సదుపాయం కల్పిస్తుందని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యుత్‌శాఖ జేఈ రవి కుమార్, సర్పంచ్ కోన లోవరాజు, వైస్ సర్పంచ్ పందల దేవా, ఎంపీటీసీ సభ్యుడు పూడి దేవా, గ్రామనాయకులు కోట గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పాడిగేదె మృతి



మృతి చెందిన పాడి గేదె

రావికమతం : మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పశువుల పాకకు నిప్పు పెట్టిన సంఘటన మండలంలో గర్నికంలో చోటు చేసుకుంది. బాధితుడు కోర్ని బోసిబాబు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామంలో బాల చెంచుమ్మ గుడి సమీపంలో పశువుల పాకలో సాయంత్రం గేదెలను కట్టి ఇంటికి వచ్చామని, రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాకకు నిప్పు పెట్టారని, ఈ ఘటనలో పాక పూర్తిగా కాలిపోవడంతో లక్ష రూపాయల విలువ గల పాడి గేదె మృతిచెందగా, మరో పాడిగేదె బాగా కాలిపోయిందన్నారు. అలాగే రెండు గడ్డి వాములు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల నష్టం ఏర్పడిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దోషులను గుర్తించి తనకు న్యాయం చేయాలని బాధితుడు బోసిబాబు వేడుకున్నాడు.

పశువులకు థైలీరియా టీకాలు వేయించాలి



గొండుపాలెంలో పశువులకు థైలీరియా టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ దినేష్‌కుమార్

కె.కోటపాడు : థైలీరియా వ్యాధి బారిన పశువులు పడకుండా రైతులు ముందస్తుగా టీకాలను వేయించాలని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. గొండుపాలెం గ్రామంలో బుధవారం నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ వ్యాధి బారిన పడిన పశువుల తీవ్రమైన జ్వరంతో బలహీనపడతాయని, తద్వారా పాల దిగుబడి తగ్గుతుందన్నారు. ఈ వ్యాధి సోకకుండా రైతులు తమ పశువులకు ఉచిత టీకాలు వేయించాలని సూచించారు. చౌడువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు, సిబ్బంది సమీరా, ప్రవీణ్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితం నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న రూరల్ సీఐ రేవతమ్మ

నాతవరం : యువత చెడు వ్యసనాలకు బానిసై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ అన్నారు. ఆమె బుధవారం డి.యర్రవరం గ్రామంలో గంజాయి నియంత్రణ రోడ్డు ప్రమాదాలు చెడు అలవాట్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ఇటీవల కాలంలో గంజాయికి బానిసై నిండు జీవితాలను కళ్ల ముందే నాశనం చేసుకోవడం చూస్తే బాధేస్తుందన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డివిజన్‌లో అన్ని గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం గంజాయిని నిర్మూలించేందుకు అనేక చర్యలు చేపడుతుందన్నారు. బాలలపై జరుగుతున్న అఘాత్యాలు పోక్సో యాక్టు చట్టం సైబరు నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాతవరం ఎస్ఐ భీమరాజు పాల్గొన్నారు.

యంత్రాలతో వరినాట్లపై అవగాహన



పెనందిపల్లిలో రైతులకు యంత్రంతో నాట్లు వేసే పద్ధతిపై అవగాహన కల్పిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: యంత్రం సహాయంతో వరినాట్లు వేయడం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మ అన్నారు. పెదనందిపల్లిలో గ్రామానికి చెందిన కళింకోట శంకర్, చిత్రాడ జగదీశ్వరరావు రైతు పొలాల్లో యంత్రం సహాయంతో నాట్లు వేయించి స్థానిక రైతులకు, వ్యవసాయ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. యంత్రంతో నాట్లు వేయడం ద్వారా క్రమ పద్ధతిలో మొక్కలు పడతాయని, తద్వారా గాలి వెలుతురు బాగా తగిలి పంట ఏపుగా ఎదుగుతుందన్నారు. పంట తెగుళ్ల బారిన పడకుండా రక్షించుకోవచ్చునని రైతులకు వివరించారు. మండలంలోని బోయిలకింతాడ, పెదనందిపల్లి, వేచలం, మామిడిపల్లి, ఏ.కొత్తపల్లి, కలిగొట్ల గ్రామాలలో 150 ఎకరాల్లో నాట్లు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. యంత్రం ద్వారా నాట్లు వేసేందుకు ఎకరానికి రూ. 4,500 మేర ఖర్చు అవుతుందని, రోజుకు 5నుంచి 6 ఎకరాలకు వరకు నాట్లు వేసుకోవచ్చునని ఏవో కాంతమ్మ రైతులకు తెలియజేశారు.

మోదమాంబ జాతర గోడపత్రిక విడుదల



కె.జె.పురం మోదమాంబ గోడపత్రికను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించే మోదమాంబ అమ్మవారి జాతరకు హాజరు కావాలని జాతర ఉత్సవ కమిటీ వారు మాజీ ఏమ్మెల్యే, యలమంచిలి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీని బుధవారం ఆహ్వానించారు. ఈ మేరకు ఆయనను గాజువాకలో ఆయన స్వగృహం వద్ద కలిసి ఆయన చేతుల మీదుగా జాతర గోడపత్రికను విడుదల చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ రాపేట జోగినాయుడు, కమిటీ వైస్ చైర్మన్ రాపేట రాజశేఖర్ నాయుడు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ శరగడంఆదిబాబుతో పాటు క్లస్టర్ ఇన్‌చార్జి కాళ్ల నర్సింగ రాజు, ఆదారి బలరామ్ పాల్గొన్నారు. అనంతరం అనకాపల్లి, చోడవరం, ఎమ్మెల్యేలు, కొణతాల రామకృష్ణ, కె.ఎస్.ఎన్.ఎస్ రాజుతో పాటు మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడును కలిసి జాతరకు ఆహ్వానించారు.

అంగన్‌వాడీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



సీడీపీవో శశికళ

మాడుగుల : అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహార పథకాలు ప్రతి మహిళ. సద్వినియోగం చేసుకోవాలని మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి శశికళ అన్నారు. బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు. తాను అనకాపల్లి నుంచి మాడుగుల ప్రాజెక్టు అధికారిగా రెండు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రాజెక్టు పరిధిలో ఉన్న 158 అంగన్‌వాడీ కేంద్రాలను విజిట్ చేసి అక్కడ సమస్యలుంటే పై అధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పూర్వ ప్రాథమిక విద్య ఆటలు పాటలతో నేర్పిస్తున్నామన్నారు. రానున్న వర్షాకాలం రీత్యా కేంద్రాల దగ్గరలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలు గుర్తించి పై అధికారులకు నివేదిక అందిస్తామన్నారు. అలాగే బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, ఎవరైనా బాల్య వివాహాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమయ పాలన పాటించకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈమె వెంట సూపర్‌వైజర్‌లు, ఈశ్వరమ్మ, పి.చిన్నమ్ములుతో పాటు ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నారు.

139 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలను నిర్వహిస్తున్న అప్తాలమిక్ దుర్గా భవానీ

కె.కోటపాడు : కంటి సంబంధిత సమస్యలకు త్వరితగతిన మెరుగైన వైద్యం పొందాలని జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కళిరెడ్డి అప్పలనాయుడు, కె.కోటపాడు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు అన్నారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో కంటి శిబిరంను శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది బుధవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఆప్తాలమిక్ అధికారి దుర్గా భవానీ 139 మందికి కంటి పరీక్షలను జరిపారు. వీరిలో 25 మందికి శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో సబ్బవరపు రామునాయుడు, కన్నూరు అప్పలనాయుడు, రుద్ర ఈశ్వరరావు, క్యాంప్ కోఆర్డినేటర్ అశ్వినికుమార్, నర్సింగ్ స్టాఫ్ తేజస్విని పాల్గొన్నారు.

సంఘటిత పోరాటంతోనే హక్కుల సాధన



రోలుగుంటలో సమావేశమైన కార్మిక సంఘాలు

రోలుగుంట : సీఐటీయూ అధ్వర్యంలో పలు శాఖల్లో పని చేస్తున్న ఆశాలు, ఐకేపీ, మధ్యాహ్న భోజనం, ముఠా కార్మికులు, పంచాయతీ, శానిటేషన్ కార్మికులు తమ సమస్యలపై మండలకేంద్రం రోలుగుంటలో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు చిరంజీవి, అరెగెల్ల రాజు మాట్లాడుతూ కనీస వేతనాలు చెల్లించాలని, పని గంటలు కుదించి, ఉద్యోగ భద్రత కల్పించి లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘటితంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అనంతరం ఆయా సంఘాలకు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా ఇంద్ర, కార్యవర్గ సభ్యులుగా రాజబాబు, జ్యోతి, రాము, ఈశ్వర్రావు, కృష్ణ ఎన్నికయ్యారు.

నిమ్మగెడ్డ గ్రామంలో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ : నిమ్మగెడ్డ గిరిజన గ్రామంలో బుధవారం వైద్యాధికారి శ్యామ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. గ్రామంలో గిరిజన ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించి, జ్వరాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గిరిజన ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని ముఖ్యంగా తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సుమారుగా 40 మంది రోజులకు పరిక్షలు చేసి మందులు అందజేసినట్టు వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ కేపీ నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలు లేక వరి రైతులకు కష్టాలు



పైపులతో వరి నారుకు నీరు పెడుతున్న రైతులు

రావికమతం: ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు చేసే రైతులకు కష్టాలు తప్పడం లేదు. గత నెలలో వర్షాలు ఎక్కువగా పడడంతో రైతులు వరి విత్తనాలు వేశారు. రెండు వారాలుగా వర్షాలు లేకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. కొందరు రైతులు బిందెలతో, బకెట్లతో నీరు తెచ్చి వరినారు తడుపుతున్నారు. ఈ ఏడాదిలో మండలంలో 2,181 హెక్టార్లలో రైతులు వరి సాగుకు సిద్ధమయ్యారు. గత ఏడాది కోతల సమయంలో వర్షాలు భారీగా కురవడంతో రైతులు సొంతంగా విత్తనాలు సిద్ధం చేసుకోలేకపోయారు. దీంతో వరి విత్తనాలు అప్పులు చేసి కొనుగోలు చేసి నారుపోశారు. విత్తనాలు రేటు కూడా గత ఏడాది కంటే ఎక్కువగా ఉండడంతో రైతులపై ఆర్థిక భారం పడింది. గత ప్రభుత్వంలో పంటలు వేసే సమయంలో రైతు భరోసా అందేవి. దీంతో వ్యవసాయ పెట్టుబడులకు సహాయపడేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అన్నదాత సుఖీభవ పేరిట రైతులకు ఆర్థిక సాయం ఇస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకూ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఒకవైపు వర్షాలు లేక మరోవైపు ప్రభుత్వ సాయం అందక రైతులు ఆవేదన చెందుతున్నారు.

రేపు 17 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం : ఈ నెల 18న రెండు పీడర్ల పరిధిలో 17 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్‌శాఖ నర్సీపట్నం ఈఈ అప్పారావు బుధవారం తెలిపారు. మాకవరపాలెంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి సరఫరాకు అంతరాయం లేకుండా చెట్ల కొమ్మలు తొలగించనున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో గిడుతూరు, లచ్చన్నపాలెం ఫీడర్ల పరిధిలో గల కొండలఅగ్రహారం, లచ్చన్నపాలెం, దాలింపేట, జి.గంగవరం, సీతన్నఅగ్రహారం, కృష్ణాపురం, శ్రీరాంపురం, చంద్రయ్యపాలెం, గిడుతూరు, బయ్యవరం, ఎన్.జి.ఆర్. పి.అగ్రహారం, పి.పి.అగ్రహారం, నారాయణరాజుపేట, అదురువాడ, బి.ఎస్.పేట, జంగాలపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి సబ్ స్టేషన్ మరమ్మతులు నిమిత్తం సబ్ స్టేషన్‌లో ఈ నెల 18న విద్యుత్ సరఫరా నిలుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శారదానగర్, బ్యాంకు కాలనీ, నర్సీపట్నం మెయిన్ రోడ్డు, సుబ్బారాయుడుపాలెం, కుసర్లపూడి, జానకీరాంపురం, ధర్మసాగరం, జోగినాథపాలెం , చెట్టుపల్లి, గురంధరపాలెం, నిండుగొండ, వెలంకాయలపాలెంకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విషయాన్ని వినియోగదారులు పరిగణలోకి తీసుకుని సహకరించాలని కోరారు.

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎం.అలమండ ఫీడర్‌లో 11 కేవీ లైన్ మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్థానిక ఎలక్ట్రికల్ ఏఈఈ కె. శంకరరావు తెలిపారు. ములకలాపల్లి, కొత్తపెంట, ఎన్జీ.నగరం, ఎం.అలమండ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. అలాగే దేవరాపల్లి సబ్‌స్టేషన్ నుంచి ఆనందపురం వరకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, బి.కింతాడ సబ్‌స్టేషన్ నుంచి గవరవరం ఏబీ స్విచ్ఛ వరకు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు 33 కేవీలైన్ మరమ్మతు పనులు చేపడుతున్నామన్నారు.

చీడికాడ : విద్యుత్ లైన్ మరమ్మతుల్లో భాగంగా తురువోలు ఫీడర్ 11 కేవీ లైన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఫీడర్ పరిధిలో గల చీడికాడ, తురువోలు, అర్జునగిరి, జి.కొత్తపల్లి, పెదగోగాడ, వరహాపురం, వింటిపాలెం, చుక్కపల్లి, చెట్టుపల్లి, బైలపూడి, జైతవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ వెంకటరావు తెలిపారు.

రోలుగుంట : మండలంలో పలు గ్రామాల్లో నర్సీపట్నం డివిజన్ రోలుగుంట సెక్షన్ పరిధిలో 33/11 కేవీ లైనులో శుక్రవారం రోలుగుంట, కె.నాయుడుపాలెం, కొమరవోలు, కొంతలం, గబ్బాడ, బుచ్చింపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆశాఖ నర్సీపట్నం డివిజన్ ఈఈ అప్పారావు తెలిపారు. పై గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.